# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త






## ప్రతి ఇంట ఆనందాలు వెల్లివిరియాలి

**- మంత్రి ఆర్‌కె రోజా**



నగరి, జనవరి 14 ప్రభాతవార్త: ప్రతి ఇంట ఆనందాలు వెల్లి విరియాలని మంత్రి రోజా అన్నారు. శనివారం నగరి పట్టణంలోని తన నివాసంలో కుటుంబ సభ్యు లతో కలసి ఆమె భోగి మంటలు వేసి భోగి పండుగను జరుపుకున్నారు. ఆమె మాట్లాడు తూ జగనన్న పాలనలో భోగి పండుగ పాత వస్తువులతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న కష్ట నష్టాలను కూడా కాల్చి వేసిందన్నారు. ప్రతి ఇంటా భోగి భోగభాగ్యాలను నింపాలని కోరుకుంటున్నానన్నారు. కార్యక్రమంలో ఆమె భర్త అధ్యక్షుడు సెల్వమణి, కుమార్తె అన్షుమాలిక, కుమారుడు కృష్ణకౌశిక్, అన్న రామ్‌ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

## వైభవంగా గోదా కల్యాణం



తిరుపతి,జనవరి 14ప్రభాతవార్త: పవిత్రమైన ధనుర్మాసం ముగింపు సందర్భంగా శనివారం ఉదయం తిరుపతిలోని అన్నమాచార్యకళామందిరంలో గోదా కల్యాణం వేడుకగా జరిగింది. ఇక్కడ గోదాదేవి(ఆండాళ్), రంగనాథస్వామి ఉత్సవర్లను కొలువుతీర్చారు. అనంతరం శాస్త్రోక్తంగా కల్యాణఘట్టం నిర్వహించారు.

# సైకో పాలనకు చరమగీతం

**పన్నుల వాతలు చార్జీల మోతలు**
**బోగిమంటలు వెలిగించిన చంద్రబాబు**



చంద్రగిరి, జనవరి 14 ప్రభాతవార్త: రాష్ట్రంలో సాగుతున్న సైకో పాలనకు చరమగీతం పాడాలని మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. నారావారిపల్లిలో శనివారం నారా, నందమూరి కుటుంబ సభ్యుల కలయికలో బోగిమంటలు వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన ప్రజావ్యతిరేక ప్రభుత్వ విధానాలను ఎండగట్టారు. బోగి మంటల్లో పాత వస్తువులను ఏ విధంగా అయితే దగ్ధం చేస్తామో అదేరీతిన విధ్వంసకర పాలనతో ప్రజలను నరకయాతనపెడుతున్న వైసిపి ప్రభుత్వాన్ని పాతరవేయాలన్నారు. ప్రభుత్వం తీసుకువచ్చిన చికటి చట్టాలలో ఒకటైన నంబర్ 1 జీఓ ప్రతులను బోగిమంటల్లో కాల్చి నిరసన తెలిపారు. జిల్లా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భవిష్యత్తులో ఊచలు లెక్కబెట్టకతప్పదనే విషయం విస్మరించవద్దని హెచ్చరించారు. టిడిపి నాయకులను ఇబ్బందులకు గురి చేసి అక్రమ కేసులతో జైలుకు పంపిన ఏ ఒక్కరినీ వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

# పండుగ వేళ..... జిల్లాలో వేడెక్కిన రాజకీయం !

## చంద్రబాబు, పెద్దిరెడ్డి పరస్పర విమర్శలతో సంచలనం!!



ప్రభాతవార్త–తిరుపతి: ఉమ్మడి చిత్తూరు జిల్లా రాజకీయాల్లోనేగాక రాష్ట్రరాజకీయాల్లోనూ కీలకంగా మారిన, తలపండిన ఇద్దరు సీనియర్ నేతలు పరస్పరం విమర్శలు చేసుకోవడంతో సంక్రాంతిపండుగ వేళ జిల్లాప్రజల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఎన్నికలకు మరో ఏడాది సమయం ఉండగానే ఇప్పుడే జిల్లాలో రాజకీయం వేడెక్కిందనే చర్చ సర్వత్రా మొదలైంది. ఇందుకు మాజీముఖ్యమంత్రి, తెలుగుదేశం అధినేత నారాచంద్రబాబునాయుడు స్వగ్రామం చంద్రగిరి నియోజకవర్గం నారావారిపల్లెను వేదిక చేసుకుని శనివారం ఉదయం భోగిపండుగ వేళ భోగిమంటల్లో జిఓ నంబర్ 1 ప్రతులను దగ్ధం చేసి, ప్రజలు, పార్టీ నేతలనుద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో సైకోపాలన సాగుతోందని, ఆయన సైకోల కారణంగా ప్రజలు ఆస్తులు కోల్పోతున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రజల మెడపై కత్తిపెట్టి ఆస్తులు రాయించుకుంటున్నారని ఆరోపించారు. పుంగనూరులో టిడిపి కార్యకర్తలు, నాయకులపై 40 రోజుల్లో 10 కేసులు పెట్టారని, కార్యకర్తలను పండుగపూట జైల్లో పెట్టారని చంద్రబాబు మండిపడ్డారు. దీనికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తప్పక అనుభవిస్తాడని, గుర్తుపెట్టుకో పెద్దిరెడ్డి అని చేసిన ఆరోపణలు ఇప్పుడు జిల్లాలో అధికార పార్టీ శ్రేణుల్లో భోగిరోజు మరింత వేడెక్కించేలా మారాయి. దుర్మార్గాలకు పాల్పడుతున్న ప్రతిఒక్కరి లెక్కలు రాసిపెడుతూన్నామని, ఈ సంక్రాంతి సందర్భంగా చెబుతున్నానని, ఇంతకు ఇంత చేద్దామని చంద్రబాబు పార్టీ శ్రేణులకు ఆత్మస్థైర్యం కల్పించారు. చిత్తూరుజిల్లాకు పట్టిన శనిలా పెద్దిరెడ్డి మారిపోయాడని చంద్రబాబు ఘాటు విమర్శలు చేయడం సంచలనంగా మారింది. ఈ విమర్శల వ్యాఖ్యలపై మంత్రి పెద్దిరెడ్డి కూడా స్పందించారు. చంద్రబాబు వ్యాఖ్యల అనంతరం కొంతసమయంలోనే మంత్రి కూడా మీడియా సమావేశం నిర్వహించి ప్రతిపక్ష టిడిపి అధినేత చంద్రబాబుపై తగ్గేదిలేదంటూ విమర్శలు చేశారు. భోగిపండుగ రోజు భోగిభాగ్యాలు ఇస్తారని అందరూ కుటుంబసభ్యులతో కలసి సంతోషంగా గడుపుతామని, అయితే ఇలాంటి రోజు చంద్రబాబునాయుడు నన్ను గుర్తుతెచ్చుకుని ,నారావారిపల్లెలో ఏడుస్తున్నాడంటే చాలా బాధగా వుందని వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు ఏడుపుకు కారణం ఈ జిల్లాలో ఎప్పుడూ ఆయన మెజార్టీ సాధించకపోవడమేనని అన్నారు. గతంలో కాంగ్రెస్,ఇప్పుడు వైసిపిదే పైచేయి అన్నారు.కుప్పంలో కూడా బాబు జెండా పీకేయడం ఖాయమని గుర్తుచేసుకుని ఏడుస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ జిల్లాకు ఏం చేశావో చెప్పాలని మంత్రి పెద్దిరెడ్డి ప్రశ్నించారు. జిల్లాలో ఎవరు భారమని ప్రజలు చెప్పాలని ఆయన ప్రతిసవాల్ విసిరారు. ప్రజల రక్షణ కోసం తీసుకువచ్చిన జిఓను మంటల్లో కాల్చడం అంటే జిఓను కాదని, నీబుద్ధిని ,ముఖ్యమంత్రి కావాలన్న నీ తాపత్రయాన్ని అని మంత్రి పేర్కొన్నారు. బాబుకు క్యారెక్టర్ లేదని మంత్రి పెద్దిరెడ్డి వ్యాఖ్యలు టిడిపి నేతల్లో మరింత కాకపుట్టిస్తున్నాయి. మరీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా రానున్న రోజుల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రాజకీయం మరింత రంజుగా మారనుందనేది అన్ని పార్టీల కార్యకర్తలు, శ్రేణుల్లో కలవరపెడుతోంది.

# అనుప్పల్లిలో జల్లికట్టు ..

**పలువురికి గాయాలు**




రామచంద్రాపురం, జనవరి 14 ప్రభాతవార్త: బోగిపండుగను పురస్కరించుకుని శనివారం అనుప్పల్లిలో జల్లికట్టు సంబరాలను నిర్వహించారు. పశువులను కొమ్ములను అందంగా అలంకరించి, కొయ్యచెక్కలతో చెక్కిన పలకను రంగులద్ది పశువుల కొమ్ములకు కట్టారు. ఈ క్రమంలో కొందరు రైతులు తమ అభిమాన నాయకులు, వివిధ దేవతా చిత్రాలను చెక్కపై అతికించారు. పలకలను పశువుల కొమ్ములకు కట్టి డప్పుల శబ్దాలతో పశువులను జనంలో వదలిపెట్టారు. ఈ క్రమంలో పశువులను నిలువరించి పట్టీలను సొంతం చేసుకోవాలనుకున్న పలువురు యువకులు గాయాలపాలయ్యారు. జల్లికట్టును తిలకించేందుకు పరిసర గ్రామాల నుండి వేలాధిగా ప్రజలు తరలివచ్చారు.



# పాడి పంటలతో కళకళ


**- జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి ఉషశ్రీ చరణ్ సంక్రాంతి శుభాకాంక్షలు**



చిత్తూరు, జనవరి 14 ప్రభాతవార్త: జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం పాడి పంటలు పండించి కళకళ లాడాలని జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి ఉషశ్రీచరన్ ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు సంక్రాంతి పురస్కరించుకొని జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి ఉషశ్రీ చరణ్ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా రైతులు పంటలు సమృద్ధిగా పండించి అష్టఐశ్వర్యాలతో తలతుగాలని ఆమె కోరారు.

### విస్తారంగా పంటల సాగు జరగాలి

**- డిప్యుటీ సిఎం నారాయణస్వామి**



ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా విస్తారంగా పంటలు సాగు జరుగాలని డిప్యుటీ సిఎం నారాయణస్వామి ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు డిప్యుటీ సిఎం నారాయణస్వామి శనివారం సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా పాడి పంటలతో సస్యశ్యామలంగా తులతూగాలని ఆయన ఆకాంక్షించారు.

### సస్యశ్యామలంగా పంటలు

**మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి**



వర్షాలు సమృద్ధిగా కురిసి ఈ ఏడాది రైతులు సస్యశ్యామలంగా పంటలు పండించాలని జిల్లా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆకాంక్షించారు. జిల్లా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సంక్రాంతి సందర్భంగా జిల్లా ప్రజలకు శనివారం శుభాకాంక్షలు తెలిపారు.

### ప్రతి గడపలో ఆనందం

**- జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు**



సంక్రాంతి సందర్భంగా జిల్లాలోని ప్రతి ఇంటి గడపలో ఆనందం వెల్లివిరావాలని జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు ఆకాంక్షించారు. సంక్రాంతి పురస్కరించుకొని శనివారం జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో ప్రతి రైతు పంటలు బాగా పండించి సంక్రాంతి పండుగను వైభవంగా జరుపుకోవాలని ఆయన కోరారు.

### అభివృద్ధికి అంకితం: కలెక్టర్ హరినారాయణన్



జిల్లా అభివృద్ధికి ఇటు అధికారులు, అటు ప్రజా ప్రతినిధులు కంకణం కట్టుకొని ముందుకు వెళ్ళాలని కలెక్టర్ హరినారాయణన్ పిలుపునిచ్చారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకొని కలెక్టర్ హరినారాయణన్ శనివారం జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు పాదర్శకంగా అమలు చేస్తున్నామని అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఆయన కోరారు.

### తెలుగుదనం ఉట్టిపడేలా సంక్రాంతి : ఎస్పీ రిశాంత్‌రెడ్డి



తెలుగుదనం ఉట్టిపడేలా సంక్రాంతి పండుగను ప్రతి ఒక్కరు ఘనంగా నిర్వహించుకోవాలని ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఆకాంక్షించారు. సంక్రాంతి పురస్కరించుకొని శనివారం ఎస్పీ రిశాంత్‌రెడ్డి జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి పండుగతో మన సంప్రదాయంను విశ్వమంతా తెలుపుతూ ఇంటిల్లిపాది నిత్యం సుఖ సంతోషాలతో వుండాలని ఎస్పీ రిశాంత్‌రెడ్డి కోరారు.

## ముఖ్యమంత్రి దంపతులతో చెవిరెడ్డి 'భోగిమంటలు'



చంద్రగిరి, జనవరి 14 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, వైఎస్ భారతి దంపతులతో కలసి ఎంఎల్‌ఏ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి శనివారం బోగిమంటలు వేశారు. సంక్రాంతిని పురస్కరించుకుని తెలుగింటి సంస్కృతీ సంప్రదాయాలకు అనుగుణంగా వారం రోజుల పాటు చెవిరెడ్డి వ్యక్తిగతంగా శ్రమించి చేపట్టిన గోశాల నిర్మాణం ముఖ్యమంత్రి దంపతులను విశేషంగా ఆకట్టుకున్నది. తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం వద్ద చెవిరెడ్డి ఏర్పాటు చేసిన గోశాలలో భారతి జగన్ దంపతులు చెవిరెడ్డితో కలసి బోగిని వెలిగించి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మస్తాన్, రామిరెడ్డిపల్లి సర్పంచ్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి, ప్రభుత్వ యంత్రాంగం పాల్గొన్నారు.

## కన్నుల పండువగా అయ్యప్ప మకరజ్యోతి దర్శనం





సదుం,జనవరి 14 ప్రభాతవార్త మండల పరిధిలోని యత్రాతివారిపల్లెలోని బురుజు కొండపై వెలసిన శ్రీఅయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం సాయంత్రం అయ్యప్ప మకరజ్యోతి దర్శనం కన్నుల పండువగా జరిగింది. తొలుత స్వామి వారిని ఆలయ ధర్మకర్త, విద్యుత్,అటవీ పర్యావరణశాఖల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,తంబళ్లపల్లె శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డిలు దర్శించుకుని ఇరుముడులు సమర్పించి నెయ్యాభిషేకం చేయించారు. సాయంత్రం 4గంటలకుస్థానిక సదుమమ్మ ఆల యంలో తిరువాభరణాల పెట్టెకు పూజలు నిర్వహించి రకాల వాయిద్యాలు కేరళ వాయిద్యాల నడుమ రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకనాదరెడ్డి,కుటుంబ సభ్యులతో కలిసి వెంటరాగా తిరువాభరణాల పెట్టెను తలపై పెట్టుకుని ఊరేగింపుగా అయ్యప్ప ఆలయంలోకి తీసుకు వచ్చారు. పూజారి నంబూద్రి నారాయణన్ నగలను స్వామి వారికి అలంకరించారు.సాయంత్రం 6.40 గంటలకుతూర్పున ఆకాశంలో నక్షత్రాకారంలో మకర జ్యోతి దర్శనం కలిగింది. అదే సమయంలో ఆలయం ముందర ఉన్న కర్పూర హోమగుండాన్ని పూజారి వెలిగించారు. స్వామి శరణం అయ్యప్ప అనే భక్తుల నినాదాలతో ఆలయ పరిసరాలు మారుమ్మోగాయి.

# పెన్షన్లలో కుంభకోణం!

**- అనర్హులకు పెన్షన్లు మంజూరు**
**- వాలంటీర్ భర్తదే కీలకపాత్ర**

పాలసముద్రం, జనవరి 14 ప్రభాతవార్త: పాలసముద్రం మండలంలో సామాజిక పెన్షన్ల మంజూరులో భారీ కుంభకోణం జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అనర్హులైన కొంతమంది ప్రక్కరాష్ట్రం తమిళనాడుకు వెళ్ళి అక్కడ ఆధార్ కార్డులో మార్పులు చేసుకొని ఇక్కడికి వచ్చి పెన్షన్లకు దరఖాస్తు చేసుకొని భారీగా లబ్దిపొందుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ వ్యవహారంలో వనదుర్గాపురం సచివాలయ పరిధిలోని ఒక వాలంటీర్ భర్త కీలకపాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం 60 సంవత్సరాలు దాటిన వారికి అర్హత వుంటే వృద్ధ్యాప్య పెన్షన్లను మంజూరు చేస్తోంది. ఇందుకోసం అర్హులైన వారు తాము 60 సంవత్సరాలు పూర్తి చేసుకొన్నట్లు ధృవపత్రాలను అధికారులకు సమర్పించాల్సి వుంటుంది. ఈ మేరకు దరఖాస్తుదారులు సమర్పించిన ధృవపత్రాలను పరిశీలించి అధికారులు అర్హులైన వారికి వృద్ధ్యాప్య పెన్షన్లు మంజూరు చేస్తారు. ఇటీవల ప్రభుత్వం పాలసముద్రం మండలంలో అనర్హులైన కొంత మంది చేనేత పెన్షన్లను రద్దు చేసింది. ఇలా చేనేత పెన్షన్లు రద్దు అయిన వారు ప్రక్క రాష్ట్రం తమిళనాడు తిరువళ్ళూరు జిల్లా పళ్ళిపట్టు తాలుకా ప్రొద్దుటూరు పేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళి ఆధార్ కార్డులో తమ వయస్సు తక్కువ వున్నట్లు ధృవపత్రం తీసుకొని అక్కడి నుండి అత్తిమంజేరి పేట మీసేవా కేంద్రంకు వెళ్ళి ఆధార్ కార్డులో వయస్సు మార్పు చేసుకొంటున్నట్లు ఆరోపణలు వున్నాయి. ఇలా మార్పు అయిన వయస్సుతో పెన్షన్‌కు దరఖాస్తు చేసుకొని అత్యధికులు లబ్దిపొందుతున్నారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం వనదుర్గాపురం గ్రామ సచివాలయంకు పెన్షన్ కోసం ఒక వ్యక్తి వెళ్ళాడు. అధికారులు ఆ వ్యక్తి వద్ద వున్న ఆధార్ కార్డులో వయస్సు సరైనది కాదని మూడు నెలల క్రితం వరకు ఆధార్ కార్డులో వయస్సు ఒక తరహాలో వుంటే ప్రస్తుతం మరో తరహాలో వుందని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించి ధృవపత్రాలు తీసుకు వచ్చి సమర్పిస్తే పెన్షన్‌కు దరఖాస్తు చేస్తామని అధికారులు స్పష్టం చేశారు. ఈ క్రమంలో తమిళనాడు నుండి తీసుకువచ్చిన సర్టిఫికేట్‌ను కొందరు సమర్పించగా ఇక్కడి సర్టిఫికేట్ కావాలని అధికారులు స్పష్టం చేశారు. దీనిపై స్థానిక ఓ నాయకుడు సచివాలయ సిబ్బందిపై దౌర్జన్యం చేశాడు. ఈ విష యంపై నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఎపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురప్రసాద్ స్పందిస్తూ వనదుర్గాపురం సచివాలయ పరిధిలో అర్హులైన వారికి పెన్షన్లు మంజూరు చేయాలని, తప్పుడు సర్టిఫికేట్లతో పెన్షన్ లబ్ది పొందాలని భావించే వారిపై విచారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### అర్హులకే పెన్షన్లు: కార్యదర్శి సత్యనారాయణ

వనదుర్గాపురం గ్రామ సచివాలయం పరిధిలో అర్హులైన వారికి సిబ్బంది పెన్షన్లు మంజూరు చేస్తున్నారని, అయితే కొంతమంది నాయకులు అనర్హులకు పెన్షన్లు మంజూరు చేయాలని బెదిరింపులకు పాల్పడుతున్నారని పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. తమిళనాడు రాష్ట్రం నుండి తీసుకువచ్చిన నకిలీ సర్టిపికేట్లతో ఇక్కడ పెన్షన్ మంజూరు చేయడం సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు.

# కాణిపాకంలో ఘనంగా గోదాదేవి కళ్యాణం





వరదరాజ స్వామి ఆలయంలో జరిగిన గోదాదేవి కళ్యాణం, కాణిపాకంలో గోదాదేవికి జరిగిన గ్రామోత్సవం

కాణిపాకం, జనవరి 14 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీదేవి, భూదేవి సయిత వరదరాజ స్వామి ఆలయంలో శనివారం శ్రీగోదాదేవి కళ్యాణం అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఆలయంలో సంక్రాంతి సందర్భంగా భోగిపండుగ రోజున గోదాదేవి గ్రామోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈకార్యక్రమానికి కాణిపాకం చెందిన ధనంజయ యాదవ్ కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. వీరు ఉదయం వరుస ఉభయం తీసుకురాగా ఆలయ అర్చకులు వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ స్వామి అమ్మవార్ల ఉత్సమూర్తులకు ఘనంగా అభిషేకించి ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. అర్చకులు గోదాదేవి కళ్యాణంను అత్యంత ఘనంగా నిర్వహించారు. అలాగే ఆలయంలో స్వామి అమ్మవార్ల ఉత్సమూర్తులను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రత్యేకపల్లకిపై వుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. అంతకు ముందు గోదాదేవి కళ్యాణం సందర్భంగా ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు, ఆలయ అధికారులు స్వామి, అమ్మవార్లకు మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి సమర్పించారు. ఈకార్యక్రమంలో ఉత్సవ ఉభయదారులు ధనంజయ యాదవ్ కుటుంబీకులు, ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్లు బాలాజినాయుడు, బాబు, స్థానిక సర్పంచ్ కెఎస్.శాంతిసాగర్‌రెడ్డి ఆలయ ఉభయదారులు, వివిధ ప్రాంతాలనుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

# తెదేపా నేతలచే భోగిమంటలు

## - జిఓనెం1 ప్రతులు దగ్ధం

కుప్పం, జనవరి 14 ప్రభాతవార్త

తెదేపా అధినేత చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు కుప్పం ఎన్టీ ఆర్ వి గ్రహం వద్ద తెలుగుదేశం పార్టీ నేతలు భోగిమంటలు వేశారు. ఈ సందర్భంగా ఇటీవల ప్రభుత్వం తెచ్చిన జిఓ నెం 1 ప్రతులను భోగిమంటల్లో వేసి దగ్ధం చేశారు. అలాగే కుప్పం నియోజకవర్గంలో తెదేపా కార్యకర్తలపై నమోదైన ఎఫ్ఐఆర్ నకలు కాపీలను సైతం మంటల్లో వేసి కాల్చారు. ఈసందర్భంగా నేతలు సైకో పాలన పోవాలి.. సైకిల్ పాలన రావాలి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, చంద్రబాబు కార్యదర్శి మనోహర్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, రాష్ట్ర నేత గోపీనాథ్, ప్రధాన కార్యదర్శి ఆర్ముగం , నేతలు డా॥ వెంకటేష్, సత్యేంద్రశేఖర్, మంజునాథ్, ఆర్‌ఆర్‌రవి, వేణు, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.



**శాంతిపురం :** స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద తెదేపా నేతలు భోగిమంటలు వేసి జిఓ నెం 1 ప్రతులను దగ్ధం చేశారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు మాట్లాడుతూ జిఓనెం 1 ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకే వైకాపా ప్రభుత్వం తెచ్చిందన్నారు. కార్యక్రమంలో నేతలు విశ్వనాథనాయుడు, జనార్ధనరెడ్డి, ఉదయ్ కుమార్, ఎల్.జయరాంరెడ్డి, మణి, నాగరాజు, రమేష్, గోవిందరాజులు, కేశవులు, నాగరాజు, చంద్ర, రాజారెడ్డి, గోపాల్, శంకర్, రామకృష్ణ, ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు.

**రామకుప్పం :** రామకుప్పంలోభోగిపండగనుప్రజలుఘనంగా జరుపుకున్నారు. తెదేపా నేతలు జిఓ నెం 1 ప్రతులను భోగిమంటల్లో వేసి దగ్ధంచేశారు. కార్యక్రమంలోమండల మాజీ అధ్యక్షుడు ఆంజనేయరెడ్డి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి చేయూత: మంత్రి పెద్దిరెడ్డి

కల్లూరు, జనవరి14 ప్రభాతవార్త

ఆలయాల అభివృద్ధికి అన్ని విధాల చేయూత అందిస్తానని రాష్ట్ర అటవీ విద్యుత్, భూగర్భగనుల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. పులిచెర్ల మండలంలోని పాలెం వద్ద ఉన్న ఆనంద నిలయం అయ్యప్ప ఆలయాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్బంగా ఆయనకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. పాల ఏకిరి కార్పొరేషన్ చైర్మెన్ మురళీధర్, రాజా స్వామి, గురుస్వామి, జిల్లా ప్రింటింగ్ ప్రెస్ అధ్యక్షుడుమురళీమోహన్‌రెడ్డి, ఎంపీపీసురేంద్రరెడ్డి, మునీశ్వర, రాయల్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక మానసిక వికలాంగులకు బోధనా పరికరాలు

చిత్తూరు, జనవరి 14 ప్రభాతవార్త:



చిత్తూరు బాలాజీ కాలనీలోని ప్రాథమికోన్నత పాఠశాల పరిధిలోని ప్రత్యేక మానసిక వికలాంగులకు శనివారం ప్రత్యేక బోధనా పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేక మానసిన వికలాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఈ పథకాలను మానసిక వికాలంగులు సద్వినియోగం చేసుకొని ముందుకు వెళ్ళాలని పిలుపునిచ్చారు.

## భాజపా బూత్ కమిటీల ఏర్పాటు పూర్తి

కుప్పం/శాంతిపురం, జనవరి 14 ప్రభాతవార్త



కుప్పం, శాంతిపురం మండలాల్లో భారతీయ జనతా పార్టీ అనుబంధబూత్ కమిటీల నియామకంను పూర్తి చేసినట్లు జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శివశంకర్ తెలిపారు. శనివారం కుప్పం, శాంతిపురం మండలాల భాజపా సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల బూత్ కమిటీలను సైతం పూర్తిచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వడివేలు, కాశీనాథ్, నేతలు ఆంజనేయప్ప, గజేంద్ర, వీర రాఘవరెడ్డి, హరీష్, కదిరివేలు, కుమార్ పాల్గొన్నారు.

## స్కూటర్లు ఢీ : ఒకరికి గాయాలు

చౌడేపల్లి, జనవరి 14 ప్రభాతవార్త

రెండు మోటారు స్కూటర్లు ఢీకొని ఒకరికి గాయాలైన సంఘటన శనివారం రాత్రి చౌడేపల్లిలో చోటు చేసుకొంది. చౌడేపల్లి-పుంగనూరు ప్రధాన రహదారిలో స్థానిక అంబేద్కర్ భవనం వద్ద ఇరువైపుల నుంచి వస్తున్న టూవీలర్లు ఢీకొన్నాయి. ఈప్రమాదంలో మండలంలోని గడ్డంవారిపల్లికి చెందిన ఓబులేసు(34)కు తీవ్ర గాయాలయ్యాయి. మరో వాహనదారుడు సోమల మండలం చెన్నువారిపల్లి చిట్టిబాబు(23)కు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడ్డ ఇరువురిని 108సేవల ద్వారా పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## వరసిద్ధుని సన్నిధిలో రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమీషనర్

కాణిపాకం, జనవరి 14 ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమీషనర్ (ఆర్‌టీఐ)చెన్నారెడ్డి శనివారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఈఓ ఎ.వెంకటేశు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆయనకు వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట చిత్తూరు ఆర్డీఓ రేణుక, ఐరాల తహశీల్దార్ సుశీల, ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్ కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

## తవణంపల్లెలో ఘనంగా భోగి సంబరాలు

తవణంపల్లె, జనవరి 14 ప్రభాతవార్త:

తెలుగువారి పెద్దపండుగ సంక్రాంతి పండుగలో భాగంగా శనివారం మండల ప్రజలు భోగిపండుగను సంప్రదాయబద్ధంగా అత్యంత ఘనంగా జరుపుకున్నారు. సంక్రాంతి పండుగ పర్వదినాన్ని తెలుగుప్రజలు మూడు రోజుల పాటు సంప్రదాయంగా నిర్వహించుకోవడం ఆనవాయితీ. ఈమేరకు తొలిరోజు శనివారం భోగిపండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఇందులో భాగంగా వేకువజామున ప్రజలు తమ ఇంటిల్లపాది కలసి ఇంటి ముందు భోగిమంటలు వేశారు. అలాగే పలు గ్రామాలలో భజన బృందాలు, గ్రామస్థులు వీధుల్లో తిరుగుతూ భజనలు చేశారు. ఈసందర్భంగా సంప్రదాయం ఉట్టిపడే విధంగా మహిళలు తమ ఇంటిముందు రంగవల్లులను తీర్చిదిద్దారు. అలాగే కొందరు మాంసాహార భోజనాలు, కొందరు పిండివంటలతో ఇంటిల్లపాది విందు భోజనాలు ఆరగించి పండుగను ఘనంగా జరుపుకున్నారు.

## భోగి తేవాలి " భాగ్యం "

చౌడేపల్లి, జనవరి 14 ప్రభాతవార్త

భోగి పండుగ అందరి ఇంటా భాగ్యం తేవాలనీ, చీకు చింతా మంటల్లో మాడి మసికావాలని ప్రజలు విశేష పూజలు చేసారు. సంక్రాంతి సంబరాల్లో తొలి దశ అయిన భోగిని శాస్త్రసోక్తంగా జరుపుకొన్నారు. పాతసామాన్లు, వస్తువులను ఇంటి ముందుకు తెచ్చి మంటలేసుకొన్నారు. పండుగను పురస్కరించుకొని ఆలయాలన్నీ భక్తులతో నిండిపోయాయి.

## ఆత్మీయపలకరింపులతో ప్రారంభమైన కెపిఎల్ టోర్నమెంట్

-సప్తగిరి రాకతో హుషారులో కుర్రకారు

రాజులూరు(చౌడేపల్లి), జనవరి 14 ప్రభాతవార్త

మండలంలోని రాజులూరు సమీపంలోని ఎ.కొత్తకోట క్రాస్ వద్ద క్షత్రియ ప్రీమియర్ లీగ్ క్రికెట్(కెపిఎల్)టోర్నమెంటు ఆత్మీయ పలకరింపుల మద్య కొనసాగింది. ప్రముఖ సినీనటుడు సప్తగిరి టోర్నమెంటుకు రావడంతో కుర్రకారులో జోష్ నెలకొనింది. దాదాపు గంటపాటు ఆయన వారితో ఆడిపాడారు. కెపిఎల్ లీగ్‌లో నియోజకవర్గంలోని క్షత్రియులు, వారి పిల్లలు ఒక చోట కలుసుకొన్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొన్నారు. ఇక్కడ విద్యనభ్యసించి వేరొక చోట కొలువులు చేస్తున్న తమను సంక్రాంతి పండుగ కలిపిందని వారు ఆనందం వ్యక్తం చేసారు. క్షత్రియ యువకులు ఆడిన క్రికెట్ టోర్నమెంటు కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో రాజు క్షత్రియ సంఘం ప్రముఖులు, స్థానికులు, నియోజకవర్గంతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి క్షత్రియులు, యువతీ, యువకులు, పాల్గొన్నారు.

## బోగి మంటల్లో జిఓనెం.1 ప్రతులు

చిత్తూరు, జనవరి 14 ప్రభాతవార్త:

సంక్రాంతి సంబరాల్లో భాగంగా శనివారం తెల్లవారుజాము జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బోగి మంటలు వేసి జిఓనెం.1 ప్రతులను తగులబెట్టారు. ఈ సందర్భంగా దేశం నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రభుత్వం దురుద్దేశంతో విడుదలచేసినజిఓనెం1ను హైకోర్టు రద్దు చేయడం ప్రభుత్వానికి చెంపపెట్టు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంల రాష్ట్రదేశనాయకులువెంకిటీలసురేంద్రకుమార్, మాజీ మేయర్ కఠారి హేమలత, కార్పొరేటర్ ఆశోక్, జిల్లాపార్టీకార్యాలయకార్యదర్శిమోహన్‌రాజ్, టిడిపినాయకులుకంద, రాజశేఖర్, ఆనంద్ పాల్గొన్నా రు.

## రేపు స్పందన రద్దు

**చిత్తూరు, జనవరి 14 ప్రభాతవార్త:** చిత్తూరు నగర పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం కమీషనర్ డాక్టర్ జె.అరుణ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో నిర్వహించే స్పందన కార్యక్రమంను ఈ వారం రద్దు చేశారు. కనుమ పండుగ పురస్కరించుకొని సోమవారం ప్రభుత్వ సెలవు దినం కావడంతో స్థానిక ప్రజలు మంగళవారం నుండి సమస్యలను యధావిధిగా వార్డు సచివాలయాల్లో జరిగే స్పందన కార్యక్రమంకు హాజరై అధికారుల దృష్టికి తీసుకెళ్ళవచ్చునని కమీషనర్ డాక్టర్ జె.అరుణ తెలిపారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## చంద్రబాబును కలసిన కుప్పం తెలుగు తమ్ముళ్లు

కుప్పం, జనవరి 14 ప్రభాతవార్త



తెదేపా అధినేత, ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడును శనివారం కుప్పం తెలుగు తమ్ముళ్లు పలువురు కలసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. నారావారిపల్లికి చేరుకున్న దేశం నేతలు చంద్రబాబునాయుడుతో పాటు యువనేత నారా లోకేష్, నటుడు బాలకృష్ణను సైతం కలిశారు. ఈసందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ సంక్రాంతి పండగ అందరిలో నూతనోత్సాహం కలిగించాలని ఈఏడాది అంతా శుభాలు జరగాలని దేవుడ్ని కోరుకున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు వైకాపా ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై మరింత పోరాడాలని సూచించారు. కార్యకర్తలకు తాను అన్ని వేళలా అండగా ఉంటానన్నారు. చంద్రబాబును కలసిన వారిలో మున్సిపల్ కౌన్సిలర్లు జిమ్‌దాము, సోమశేఖర్, మాజీ ఏరియా ఆస్పత్రి ఛైర్మన్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ బీమా నగదు అందజేత

కుప్పంరూరల్, జనవరి 14 ప్రభాతవార్త



మున్సిపల్ పరిధి లక్ష్మీపురంలో ఇటీవల మృతి చెందిన ఇద్దరు వ్యక్తుల కుటుంబాలకు మున్సిపల్ కౌన్సిలర్ మణి ప్రభుత్వం తరపున వైఎస్సార్ భీమా నగదును అందించారు. ఓ కుటుంబంకు లక్షరూపాయలు, మరో కుటుంబంకు తొంభై వేల రూపాయలను ప్రభుత్వం తరపునఅందించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే దొరస్వామినాయుడు వర్థంతి

కుప్పం, జనవరి 14 ప్రభాతవార్త



కుప్పం మాజీ ఎమ్మెల్యే దివంగత బిఆర్ దొరస్వామినాయుడు 23వ వర్థంతిని ఆయన తనయుడు డిసిసి అధ్యక్షుడు డా॥ బిఆర్ సురేష్‌బాబు అధ్వర్యంలో ఘనంగా నిర వ్వహించారు. స్థానిక బస్టాండు వద్ద ఆయన చిత్రపటం ఏర్పాటుచేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కుప్పం ప్రాంత అభివృద్ధికి ఆయన ఎమ్మెల్యేగా చేసిన సేవలు ఎంతో గొప్పవన్నారు. రైతులు, ప్రజల సౌకర్యార్థం కుప్పం రెస్కో స్థాపనకు చర్యలు చేపట్టి మారుమూల ప్రాంతాలకు విద్యుత్ వెలుగులు అందించడంతో పాటు పలువురికి ఉద్యోగావకాశాలు సైతం కల్పించారన్నారు. ఆయన బాటలోనే డా॥ సురేష్‌బాబు పయనిస్తూ ప్రజాసేవలో కొనసాగుతున్నారన్నారు. కార్యక్రమంలో నేతలు గోపీనాథ్, ఆర్.రంగయ్య, జయరాం , డికెపల్లి మణి, రోజారాం, ప్రమోద్, బాలాజీ, టికె ప్రభాకర్, రాజా, ఇమ్రాన్, స్థానికులు పాల్గొన్నారు.

## లయన్స్‌క్లబ్‌చే బాలుడికి ఇరవై వేల ఆర్థికసాయం

కుప్పంరూరల్, జనవరి 14 ప్రభాతవార్త




స్థానిక కొత్తపేట ఫిషర్ కాలనీలో ఉంటున్న సతీష్ కుమారుడు యశ్వంత్ (4) అనే బాలుడు కేన్సర్‌తో బాధపడుతూ హైదరాబాదులో చికిత్స పొందుతున్నాడు. ఈ బాలుడి చికిత్స నిమిత్తం కుప్పం లయన్స్ క్లబ్ తమవంతుగా ఇరవై వేలరూపాయలను ఆర్థిక సాయంగా అందించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు డా॥ వమేష్, బిఆర్‌డి ఆస్పత్రి అధినేత డా॥ బిఆర్ సురేష్‌బాబు, లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు సోమశేఖర్, అడ్మినిస్ట్రేటర్ పిజి సెల్వం, డైరెక్టర్లు శివ, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## వైభవంగా భోగి పండుగ

బాలాయపల్లి, జనవరి 14, ప్రభాతవార్త:



మండలంలో వైభవంగా భోగి పండుగ జరిగింది. శనివారం తెల్లవారుజామున ఇళ్ల ముంగిట్లో పెద్దలు, పిల్లలు ఆనందించారు. రంగు రంగుల ముగ్గులతో గ్రామాలు కళకళలాడాయి. వైభవంగా భోగి పండుగ జరిగింది.

## ప్రజాసేవకు పాటుపడతా

- పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నక్క వెంకటేశ్వరరావు

వెంకటగిరి, జనవరి 14, ప్రభాతవార్త:



తన జీవితాంతం ప్రజా సేవకు పాటుపడతానని పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నక్క వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన జన్మదినం సంద ర్భంగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమా నులు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి తనకు ఈ పదవి ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్ర మంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్క భానుప్రియ, వైస్‌చైర్మన్ బాలయ్య, వైసీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి హరికృష్ణ, కౌన్సిలర్ మాడ జానకిరామయ్య, కందటి కళ్యాణి, పూజారి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సీఎం చంద్రబాబుకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన నేతలు

వెంకటగిరి, జనవరి 14, ప్రభాతవార్త:



మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ లకు వెంకటగిరి నియోజకవర్గ నాయకులు భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబునాయుడు, లోకేష్‌లకు పుష్పగుచ్ఛాలు అందజేశారు. నియోజకవర్గ నాయకులతో లోకేష్ కొంతసేపుముచ్చటించారు. గొల్లపల్లి మాజీ సొసైటీ అధ్యక్షుడు శ్రీరాములునాయుడు తదితరులు కలిశారు.

## ఘనంగా భోగి సంబరాలు

వెంకటగిరి, జనవరి 14, ప్రభాతవార్త:



మండలంలో ఘనంగా భోగి పండుగను ప్రజలు నిర్వహించారు. శనివారం తెల్లవారుజాము నుంచి భోగి మంటలు వేసి ఆనందోత్సాహాల నడుమ పండుగను జరుపుకున్నారు. పట్టణం, గ్రామాల్లో భోగం సంబరాలు వైభవంగా జరిగాయి.

## పండగ పేరిట పందేలు

– పోలీసులను చూసి పరారు

కోట, జనవరి 14 ప్రభాతవార్త

సంక్రాంతి సంబరాల పేరుతో జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో కోడిపందేలు, జూదాల నిర్వహణకు అధికార పార్టీ నేతలు పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. పండక్కి రెండురోజులు ముందుగానే జిల్లాలో పందెంకోళ్లు కత్తులు దూశాయి. కోట మండలం విద్యానగర్‌లో శనివారం కోడిపందేల నిర్వాహకులు పందెంకోళ్లతో సిద్ధమవుతుండగా, పోలీసులకు సమాచారం అందడంతో ఎస్ఐ పుల్లారావు తమ సిబ్బందితో వెళ్లారు. దాంతో నిర్వాహకులు పోలీసులను చూసి పరుగులు తీశారు. పోలీసులు ఒక్క కోడిని మాత్రమే స్వాధీనం చేసుకున్నారు.

# ఆధిపత్య పోరుతో ఆగిన పనులు

కోట, జనవరి 14 ప్రభాతవార్త

కోటలో వైసీపీలో ఇరువర్గాల ఆధిపత్య పోరుతో ప్రభుత్వ పనులను ఆపేశారు. ప్రభుత్వ కార్యాలయాల సముదాయాలు అన్నీ ఒకేచోట ఉండాలన్న ఉద్దేశ్యంతో నాటి దివంగత మాజీమంత్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి కోట మండల కాంప్లెక్స్ కొంత స్థలాన్ని కేటాయించారు. దీంతో వైసీపీ ప్రభుత్వం మండల తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీస్థలంలో రైతు భరోసా కేంద్రాల భవనాలను నిర్మించాలని ఒక వర్గంవారు అధికారులను తీసుకొచ్చి స్థల పరిశీలన చేశారు. దీంతో మరోవర్గంవారు ఎంపిపి దాసరి అంజమ్మ, జడ్పిటిసి దాసరి కోటయ్యల చేత తీర్మానం చేసి ఇక్కడ రైతు భరోసా భవనం నిర్మించవద్దని జిల్లా అధికారులకు పంపారు. అప్పటికే ఇక్కడ భవన నిర్మాణానికి 200 బస్తాల సిమెంటు, స్టీలు తీసుకొచ్చారు. ప్రస్తుతం సిమెంటు, స్టీలు తుప్పుపడుతున్నాయి. ఎంపిడిఓ వివరణకోటలో అధికార పార్టీలో ఆధిపత్యపోరు కారణంగా రైతు భరోసా కేంద్రం పనులు ఆగాయన్న విషయమై ఎంపిడిఓ భవానిని 'ప్రభాతవార్త' వివరణ కోరగా సచివాలయ వ్యవస్థలో భాగంగా అన్ని ప్రభుత్వ భవనాలు ఒకేచోట ఉండాలన్న ఉద్దేశ్యంతో అధికారులు ఇక్కడ నిలిపేసి పాత మండల పరిషత్ కార్యాలయం ప్రాంతంలో సచివాలయం నిర్మిస్తున్నామని, అక్కడే రైతు భరోసా కేంద్రాన్ని నిర్మించడం జరుగుతుందని చెప్పారు.

## ఘనంగా గ్రామాల్లో భోగి మంటలు

దొరవారిసత్రం, జనవరి 14 ప్రభాతవార్త



భోగి పండుగ సందర్భంగా దొరవారిసత్రం మండల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం అర్ధరాత్రి నుంచి భోగి మంటలను వేశారు. పల్లెల్లో ముళ్ల కంపలు, మొక్కలు, పాత వస్తువులను భోగి మంటల్లో వేసి పండుగను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం వేకువజాము నుంచి మహిళలు, పిల్లలు, పెద్దలు తల స్నానాలు చేసి దేవుడికి నైవేద్యాలు అందించారు. కొత్త దుస్తులు ధరించి పిల్లలు, మహిళలు పెద్దఎత్తున దేవాలయాలకు భారీఎత్తున వెళ్లారు.

## డిఎస్పిని కలిసిన వైసీపీ నేత

ఓజిలి, జనవరి 14 ప్రభాతవార్త



నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డిని ఓజిలి మండలం కురుగొండ గ్రామానికి చెందిన ఐటీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గేడి శ్రీనివాసులురెడ్డి, వైసీపీ యువజన నాయకుడు గేడి శ్రీధర్‌రెడ్డిని శనివారం కలిశారు. నాయుడుపేట డీఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం డీఎస్పీకి నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

## సాంప్రదాయబద్ధంగా భోగి వేడుకలు

నాయుడుపేట, జనవరి 14 ప్రభాతవార్త



నాయుడుపేట ప్రాంతంలో భోగి పండుగ సాంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. పట్టణంలోని అన్ని వీధుల్లో తెల్లవారుజామున చిన్నా పెద్దా, మహిళలు అంతా భోగి మంటలు వేశారు. గత మూడేళ్లుగా కరోనా కారణంగా పండగలకు దూరంగా ఉన్న ప్రజలు ఈ సారి కరోనా ఇబ్బందులు లేకపోవడంతో ఉత్సాహంగా భోగి పండగ జరుపుకున్నారు.

## పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం

నాయుడుపేట రూరల్, జనవరి 14 ప్రభాతవార్త



నాయుడుపేట పట్టణంలోని లోతువానిగుంట ప్రాంతానికి చెందిన వెంకటేష్ (26) అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. పురుగుల మందు తాగి రోడ్డుపై పడి ఉన్న వెంకటేష్‌ను స్థానికులు, కుటుంబ సభ్యులు గమనించి నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. ఇతని పరిస్థితి విషమంగా ఉండటంతో గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ యువకుడు మృతి

చిల్లకూరు జనవరి 14 ప్రభాతవార్త

మండలంలోని బోధనం టోల్‌ప్లాజా వద్ద జనవరి 2న మోటార్‌బైకుపై వెళుతూ ప్రమాదంలో గాయపడి తిరుపతిలో చికిత్స పొందుతున్న యువకుడు శనివారం మృతిచెందాడు. చిట్టమూరు మండలంలోని గునపాడు గ్రామానికి చెందిన పుల్లూరు రాజేష్ (19) చికిత్స పొందుతూ మృతిచెందినట్లు చిల్లకూరు ఎస్ఐ బి గోపాల్ తెలిపారు.

## కోడెపందాల స్థావరాలపై దాడులు



చిల్లకూరు జనవరి 14 ప్రభాతవార్త

మండలంలోని తిప్పగుంటపాళెం సమీపంలో బోగిపండుగ సందర్భంగా కోడిపందాలరాయుళ్ళు కోడి పందాలు నిర్వహిస్తుండగా విషయం తెలుసుకున్న చిల్లకూరు ఎస్ఐ బి గోపాల్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా ఇద్దరు వ్యక్తులను కోడిపుంజును 100 రూపాయాలు నగదు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేయడం జరిగింది

## సాంప్రదాయాన్ని గౌరవిస్తూ.. సంస్కృతిని స్వాగతిస్తూ భోగిమంటలు

కోట, జనవరి 14 ప్రభాతవార్త

సంక్రాంతికి ముందురోజు వచ్చే భోగిపండుగను జరుపుకోని పల్లె బహుశా రాష్ట్రంలోనే ఉండదేమో. చిన్నారుల నుంచి పెద్దల వరకు తెల్లవారుజామున తలస్నానం చేసి ఆవు పేడతో ప్రత్యేకంగా తయారు చేసిన పిడకలను మంటల్లో వేశారు. వీధుల్లో భోగిమంటలు వేసి ప్రజలు ఆనందంగా గడిపారు. ఏ ఇంట చూసినా ఆనందం తొణికిసలాడింది. వీధులన్నీ ముత్యాల ముగ్గులతో స్వాగతం పలికాయి. గ్రామాల్లో మహిళలు మరింత సందడి చేశారు. సంప్రదాయ వేషధారణలు, వస్త్రధారణతో ఆకట్టుకున్నారు.

## నారా లోకేష్ యువభేరి విజయంతానికి కృషి

పాలసముద్రం, జనవరి 14 ప్రభాతవార్త:



జాతీయ తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ యువభేరి కార్యక్రమంలో పాల్గొనడానికి ఫిబ్రవరిలో జిడినెల్లూరు నియోజవకవర్గంకు రానున్నారని నారా లోకేష్ పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకొని విజయవంతం చేయాలని నియోజకవర్గ దేశం ఇన్‌ఛార్జీ చిట్టిబాబు పిలుపునిచ్చారు. పాలసముద్రం మండలంలోని రెవా రిసార్ట్‌లో శనివారం నియోజకవర్గ దేశం ఇన్‌చార్జ్ చిట్టిబాబు ఆరు మండలాల దేశం నాయకులు, కార్యకర్తలతో నారా లోకేష్ పర్యటనపై సమావేశం నిర్వహించారు. కుప్పంలో ఈ నెల 27వ తేదీ నుండి ప్రారంభం కానున్న నారా లోకేష్ యువభేరి పలమనేరు, పూతలపట్టు, చిత్తూరు నియోజకవర్గాల అనంతరం జిడినెల్లూరు నియోజకవర్గంలో ప్రవేశిస్తుందన్నారు. నారా లోకేష్ యువభేరి కార్యక్రమంను విజయవంతం చేయడానికి ప్రతి నాయకులు, కార్యకర్త శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని మండల దేశం అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సంక్రాంతి ముగ్గుల పోటీలు

బంగారుపాళ్యం, జనవరి 14 ప్రభాతవార్త:

మండలంలోని గుండ్లకట్టమంచి మహిళా సమాఖ్య పాలశీతలకేంద్రంలో శనివారం సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పాలశీతల కేంద్రంను శ్రీజ పాల ఉత్పత్తులదారులు నిర్వహిస్తున్నారు. ఈ పాలశీతల కేంద్రం పరిధిలోని మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. అంతకు ముందు సంక్రాంతి సంప్రదాయం ప్రకారం బోగి మంటలు వేశారు. ఈ కార్యక్రమంలో విజేతలైన మహిళలకు సిఎంఆర్ షాపింగ్‌మాల్ వారి సహకారంతో బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ హరినాథ్, ఎపిఎం మీరాబాయి, శ్రీజ పాల ఉత్పత్తిదారుల సిఇ తిమ్మప్ప, శేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చంద్రారెడ్డి, మొగిలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నారావారి కోడళ్ళు ముగ్గుల పోటీలు

**విజేతలకు ప్రోత్సాహక బహుమతులు-మమేకమైన నారా భువనేశ్వరీ నారా బ్రాహ్మణీ**



చంద్రగిరి, జనవరి 14 ప్రభాతవార్త: నారావారి కోడళ్ళు నారా భువనేశ్వరీ, నారా బ్రాహ్మణీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నారావారిపల్లిలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి సంబరాలలో భాగంగా రంగంపేట నుండి భీమవరం వరకు గల గ్రామీణ ప్రాంత మహిళలు పెద్ద ఎత్తున ఈ ముగ్గుల పోటీలలో పాల్గొన్నారు. ఈ సందర్భం గా నారావారి కోడళ్ళు రంగవళ్ళులు, గొబ్బె మ్మలు ఆటలతో అలరించారు. ఎంతో బిజీ జీవితాలను కాస్త ప్రక్కనపెట్టి పండుగ రోజుల్లో సొంతూరు చేరుకుని ఆత్మీయులతో కలసి సంబరాలు జరుపుకోవడం సంతోషంగా వున్నట్లు నారా భువనేశ్వరీ, నారా బ్రాహ్మణీ తెలిపారు. తన సోదరుడు, హీరో బాలకృష్ణ నటించిన వీరసింహారెడ్డి చిత్రం చూశామనీ, మీరు చూసి యంజాయ్ చేయాలని కోరారు. మన తెలుగింటి సంస్కృతీ సంప్రదాయాలు కొనసాగిస్తూ ఇటువంటి పండుగలను జరుపుకోవడం ఆనందంగా వుందన్నారు. నారావారి ముగ్గుల పోటీలలో విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

# నారావారిపల్లెలో సంక్రాంతి సంబరాల్లో చంద్రబాబుతో పులివర్తి



తిరుపతి, జనవరి 14ప్రభాతవార్త: తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు సొంత గ్రామం నారావారిపల్లెకు కుటుంబంతో రావడంతో సంక్రాంతి సంబరాలకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లలో చంద్రగిరి టిడిపి ఇన్‌ఛార్జి పులివర్తినాని నిమగ్నమయ్యారు. హైదరాబాద్ నుంచి రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న చంద్రబాబుకు పులివర్తి నాని దగ్గరుండి స్వాగతం పలకడం, నారావారిపల్లెలో కూడా అన్ని ఏర్పాట్లు పర్యవేక్షిస్తుండటం జరుగుతోంది. శనివారం ఉదయం జరిగిన భోగిమంటలు వేయడం, అనంతరం ప్రజలు బాబును కలవడం, సంక్రాంతి సంబరాలు జయప్రదంగా జరిగేలా నాని తన కార్యకర్తలతో కలసి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.







## అమరరాజా ప్రాంగణంలో భోగి పండుగ వేడుకలు



రేణిగుంట, జనవరి 14 ప్రభాతవార్త: రేణిగుంట మండలం కరకంబాడి అమర రాజా కర్మాగారం నందలి ఫౌండర్ చైర్మన్ గల్లా రామ చంద్రనాయుడు, మాజీ మంత్రి గల్లా అరుణ కుమారి దంపతుల ఇంటి ముందు శనివారం ఉదయం భోగి పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. గల్లా అరుణకుమారి భోగి మంటలను ప్రజ్వలింప చేశారు. దంపతులు ఇరువురు అందరికి భోగి సంక్రాంతి కనుమ పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. భోగి వేడుకల్లో గల్లా కుటుంబ సభ్యులు, గౌరినేని కుటుంబ సభ్యులు గుంటూరు పార్లమెంట్ సభ్యులు అమరరాజా గ్రూప్ చైర్మన్ గల్లా జయదేవ్ దంపతులు, అమర ఆస్పత్రి చైర్మర్ వరప్రసాద్, గౌరినేని, మేనేజింగ్ డైరెక్టర్ రమాదేవి గౌరినేని, అమరరాజా గ్రూప్ సంస్థల డైరెక్టర్లు గల్లా అశోక్(సినీ నటుడు) గల్లా సిద్ధార్థ, హర్షవర్ధన్ గౌరినేని, విక్రమాధిత్య గౌరినేని తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అవసరమైన సమాచారం అందజేయాలి

**-"వార్త"క్యాలండర్ ఆవిష్కరణలో డిఆర్ఓ రాజశేఖర్**



చిత్తూరు, జనవరి 14 ప్రభాత వార్త: ప్రజలకు అవసరమైన పూర్తి సమాచారాన్ని సమ గ్రంగా తెలియజేయడంలో 'వార్త' దినపత్రిక చూపుతున్న చొరవ అభినందనీయమని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి, పలు రకాల సేవలు ప్రజలకు తెలియజేస్తూ, నిష్పక్షపాత వార్తలు ప్రచురించడంలో 'వార్త' యాజమాన్యం, సిబ్బంది కృషి అభినందనీయమని చిత్తూరు జిల్లా రెవెన్యూ అధికారి, అదనపు మేజిస్ట్రేట్ ఎన్.రాజశేఖర్ తెలిపారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా దినపత్రిక ప్రధాన పాత్ర పోషిస్తోందన్నారు. ప్రజలకు అవసరమైన సమాచార వార్తలను ప్రచురిం చడంలో వార్త ప్రాధాన్యత నిస్తోందని అన్నారు. మహిళలు, రైతాంగానికి సంబంధించిన పలు కథనాలకు దర్పం పడుతుందని తెలిపారు. "వార్త"దినపత్రిక 2023 నూతన సంవత్సరం క్యాలండర్‌ను శుక్రవారం ఉదయం చిత్తూరు జిల్లా రెవెన్యూ అధికారి, అదనపు మేజిస్ట్రేట్ ఎన్.రాజశేఖర్ ఆవిష్కరించారు. క్యాలండర్‌ను అద్భుతంగా తీర్చిదిద్దారని 'వార్త' దినపత్రిక మేనేజర్ కె.పుణ్యమూర్తిని అభినందించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

## టిటిడిలో మార్పులు,అభివృద్ధిపై 'పుట్టా' కేమి తెలుసు!?:పోకల



తిరుమల, జనవరి 14ప్రభాతవార్తప్రతినిధి: వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి తీసుకువచ్చిన మార్పులు, పలు అభివృద్ధి కార్యక్రమాలపై కనీసం సమాచారం లేకుండా టిటిడి బోర్డు మాజీ ఛైర్మన్ పుట్టా సుధాకర్‌యాదవ్ విమర్శలు చేయడం అర్థరహితమని, ఆయన ఏమీ తెలియకుండా మాట్లాడటం శోచనీయమని టిటిడి బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్ అన్నారు. ప్రస్తుత బోర్డు ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డివ్యక్తిత్వం, పారదర్శక పాలన ఆయన నైజమన్నారు.సామాన్యభక్తులకు మరింత త్వరగా సంతృప్తికర దర్శనం కల్పించడం వంటివాటిపై పట్టుకలిగిన వ్యక్తి అన్నారు. ఛైర్మన్ సుబ్బారెడ్డి ధార్మిక కార్యక్రమాలకు, హిందూ సాంప్రదాయాలకు ఎంతో విలువనిస్తున్నారని, మా పాలకమండలిలో ప్రతి చోటాగోమాత పూజ చేయాలని నిర్ణయించి, ప్రతి చోటా గోపూజ జరుగుతుందని తెలిపారు. చంద్రబాబు ప్రాపకం కోసం పుట్టాసుధాకర్‌యదవ్ పాకులాడుతూ, తప్పుడు విధానాలతో ఛైర్మన్ సుబ్బారెడ్డిపై విమర్శించడం తగదని అన్నారు. తిరుమలలో అంజనాద్రి ఆంజనేయస్వామి జన్మస్థలంగా గుర్తింపు తీసుకువచ్చి, ఆలయ నిర్మాణం చేపట్టిన ఘనత సుబ్బారెడ్డికే దక్కిందని అన్నారు. దేశంలోని మఠాధిపతులు, పీఠాధిపతుల ఆలోచనలకు అనుగుణంగా, హిందూ ధర్మవ్యాప్తికి ఎన్నో కార్యక్రమాలు అమలుచేయడంలో ఛైర్మన్‌గా సుబ్బారెడ్డి ప్రత్యేకత ఎంతో ఉందని పోకలఅన్నారు.

## 'వార్త' క్యాలెండర్ ఆవిష్కరణ



పాలసముద్రం, జనవరి 14 ప్రభాతవార్త: సంక్రాంతి పురస్కరించుకొని జిడినెల్లూరు నియోజకవర్గ తెలుగుదేశం సమన్వయకర్త భీమనేని చిట్టిబాబు శనివారం 'వార'-2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. పాలసముద్రం మండలం లోని రెవా రిసార్ట్‌లో శనివారం నియోజక వర్గ పరిధిలోని ఆరు మండలాల దేశం నాయకుల సమావేశం జరిగింది. ఈ సమా వేశంలో నియోజకవర్గ సమన్వ యకర్త భీమనేని చిట్టిబాబు వార్త నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరు మండలాల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గణనాధుని సేవలో ఏపిహైకోర్టు జడ్జి



కాణిపాకం, జనవరి 14 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ కృపాసాగర్ శనివారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఈఓ ఎ.వెంకటేశు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆయనకు వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్ శ్రీనివాస్, ఐరాల తహశీల్దార్ సుశీల, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు, ప్రోటోకాల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గొబ్బి గొబ్బియమ్మ వచ్చేసింది... గ్రామాల్లో సందడి



దొరవారిసత్రం, జనవరి 14 ప్రభాతవార్త : పండగలు వస్తాయంటే అందరి చూపూ గొబ్బి గొబ్బియమ్మల పైనే ఉంటుంది. పండగల్లో గౌరమ్మకు ప్రత్యేక స్థానం. వారంరోజుల పాటు మహిళలు భారీఎత్తున గౌరమ్మ వారోత్సవాలు ఘనంగా ఏర్పాటు చేస్తారు. అనంతరం ఆ గౌరమ్మను గ్రామంలో ఉన్న చెరువులో నిమజ్జనం చేస్తారు. ఇది ఆనవాయితీగా వచ్చే పండగ. పండగ నెల ప్రారంభం నుంచే పల్లెపల్లెనా మహిళలు గుంపులు గుంపులుగా ప్రతి ఇంటా తిరిగి గొబ్బెమ్మల ఉత్సవాలను నిర్వహిస్తారు. దొరవారిసత్రం మండలం అక్కర పాక, శ్రీధనమల్లి, కల్లూరు, తనయాలి, బూదూరు, ఉచ్చూరు, పూలతోట తదితర గ్రామాల్లో ఘనంగా శనివారం ఏర్పాటు చేశారు. పండగ వాతావరణంలో మహిళలు గొబ్బి గొబ్బియాలు అంటూ పాటలు ఆలపించారు. గౌరమ్మను చూడటానికి సుదూర ప్రాంతాల నుంచి బంధువులు తరలివచ్చారు.

## కోడిపందేల స్థావరంపై పోలీసుల దాడులు

**- పందెంకోళ్లు, వాహనాలు స్వాధీనం- 8 మంది అరెస్ట్**



గూడూరు, జనవరి 14 ప్రభాతవార్త : పండగ వేళ సరదాగా కోడిపందేలు నిర్వహిస్తున్న ఎనిమిది మంది పందెంరాయుళ్లను గూడూరు రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. రూరల్ ఎస్ఐ వి.బ్రహ్మానాయుడు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గూడూరు మండలం అయ్యవారిపాలెం గ్రామంలో కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు ముందస్తు సమాచారం అందాడంతో పోలీసు సిబ్బందితో కలిసి దాడులు చేసినట్లు తెలిపారు. కోడిపందేలు నిర్వహిస్తున్న ప్రాంతంపై దాడి చేసి ఎనిమిది మందిని అరెస్టు చేయడంతో పాటు ఐదు కోడిపుంజులు, 13 బైక్‌లు, ఒక ఆటో, తొమ్మిది సెల్‌ఫోన్లు, రూ.15 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. పండుగ వేళ కోడిపందేలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకూడదని హెచ్చరించినా నిబంధనలను ఉల్లంఘించి కోడిపందేలు నిర్వహిస్తున్న వారిని గుర్తించి అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. పండుగలు ప్రశాంత వాతావరణంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకోవాలని సూచించారు.

## సాంప్రదాయబద్ధంగా భోగి పండగ



తడ, జనవరి 14 ప్రభాతవార్త : తడ మండలంలో శనివారం భోగి పండగను సాంప్రదాయబద్ధ ంగా జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచే భోగిమంటలు వేసుకున్నారు. ఈసారి పండగ శనివారం రావడంతో మాంసాహార ప్రియులు ఇబ్బంది పడ్డారు. అయితే కరోనా వంటి ఇబ్బందులు లేకపోవడంతో పండగను కలిసికట్టుగా జరుపుకునే అవకాశం ఏర్పడింది. ఆదివారం మకర సంక్రాంతికి పల్లెజనం సిద్ధమవుతున్నారు. శనివారం కొనుగోలుదారులతో బజారులు కిటకిటలాడాయి. ఈసారి ధరలు మండిపోతున్నప్పటికీ పండగను ఘనంగా జరుపుకోవడానికి మొగ్గుచూపుతున్నారు.

### బిటెక్ విద్యార్థి అదృశ్యం

కోట, జనవరి 14 ప్రభాతవార్త : కోట మండలం కేశవరం పంచాయతీ రాఘవాపురం గ్రామానికి చెందిన చంద్రమోహన్ గూడూరులోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఈ నెల 12న ఇంటి నుంచి కళాశాలకు అని వెళ్లిన చంద్రమోహన్ తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు కోట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ పుల్లారావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.




## చంద్రగిరిలో 'వీరసింహారెడ్డి' తిలకించిన బాలకృష్ణ



చంద్రగిరి, జనవరి 14 ప్రభాతవార్త: స్థానిక ఎస్‌వి సమాస్ థియేటర్‌లో శనివారం సినీ హీరో బాలకృష్ణ అభిమానులతో కలిసి తన వీరసింహారెడ్డి చిత్రాన్ని తిలకించారు. సంక్రాంతి బరిలో రిలీజ్ అయిన వీరసింహారెడ్డి హిట్ టాక్ అందుకోవడంతో హౌస్‌ఫుల్ కలెక్షన్స్‌తో నడుస్తున్నది. సంక్రాంతి సంబరాలకై నారావారిపల్లి విచ్చేసిన బాలకృష్ణ శనివారం వేకువజామున నారావారి కుటుంభ్యులతో కలసి బోగిమంటలు వేశారు. మధ్యాహ్నం మ్యాట్నీ షోకు హాజరయ్యారు. అభిమానుల కోలాహల నడుమ చిత్రాన్ని తిలకించిన ఆయన తిరిగి నారావారిపల్లికి చేరుకున్నారు. ఈ క్రమంలో థియేటర్ వద్ద సినీ ప్రొడ్యూసర్ ఎన్వీ ప్రసాద్, తెలుగుయువత నాయకుడు శ్రీదర్‌వర్మ ఆయనకు ఘనస్వాగతం పలికారు. అయితే మ్యాట్నీ షోకు కొంత మంది టిక్కెట్ కలిగిన ప్రేక్షకులను అనుమతించకపోవడం పట్ల కొంత గందరగోళం నెలకొన్నది.

## వైభవంగా శ్రీ గోదాదేవి పరిణోత్సవం



పుత్తూరురూరల్, జనవరి 14 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణం కార్వేటినగరం రోడ్డులో వెలసిన శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శ్రీ గోదారంగనాథుల కల్యాణం వైభవంగా జరిగింది. శనివారం ఉదయం శ్రీ గీతామందిర ఆశ్రమం పీఠాధిపతి శ్రీ పుండరీక వరదానందస్వామి ఆధ్వర్యంలో, శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం నుంచఇ సారె మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా ఆలయానికి వచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందారని ఆలయ అర్చకులు రామస్వామి, ఆగమ సలహాదారు రూపేష్ స్వామి తెలిపారు. ఈ కార్యక్రమం ఆలయ నిర్వాహకులు రాజేంద్ర ఆచారి, విశ్వ బ్రాహ్మణ సంఘం సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు.

## గజలక్ష్మి వాహనంపై విహరించిన శ్రీ మూలస్థాన ఎల్లమ్మ

**అమ్మవారి ఆలయంలో సంక్రాంతి మహోత్సవాలు**



చంద్రగిరి, జనవరి 14 ప్రభాతవార్త: చంద్రగిరి గ్రామదేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారు శనివారం గజవాహనంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి సంక్రాంతి మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా సాయంత్రం అమ్మవారిని ఆలయ అర్చకులు వివిధ రకాల పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి, గజలక్ష్మీ అలంకరణలో గజవాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం శ్రీలక్ష్మీ అలంకరణలో పెద్దశేష వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం వాహనసేవకు రాజులగారి వంశస్థులు, సయంత్రం వాహన సేవకు లేట్ జి.ఎల్.రాజోపాల్ శెట్టి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు దాతలుగా వ్యవహరించారు. ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, ఈఓ పుట్టా రామకష్ణా రెడ్డి దాతలకు దర్శన ఏర్పాట్లు గావించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## సంక్రాంతి అంటే తెలియని పల్లెసీమలు

చౌడేపల్లి, జనవరి 14 ప్రభాతవార్త : మండలంలోని 12గ్రామాల ప్రజలు సంక్రాతికి నోచుకోలేదు. సాంప్రదాయ బద్ధంగా సంక్రాంతి చేస్తే వారిపాలిట శాపంగా మారుతోందన్న నెపంతో వారు సంక్రాతి పండుగ చేయడమే మానేశారు. తాతల నాటికాలం నుంచి వారు పండుగకు దూరంగా వున్నారు. మండలంలోని పరికిదొన పంచాయతీ పూర్తిగా, గడ్డంవారిపల్లి పంచాయతీలో గడ్డంవారిపల్లి, చౌడగానిపల్లి, ఆమినిగుంట పంచాయతీలోపి నూనెముద్దనపల్లి, నుంజార్లపల్లి, శింగిరిగుంట సంక్రాంతి పండుగ చేసుకోలేదు. అలా కాకుండా మూడు పర్యాయాలు సంక్రాంతిని జరిపితే పలు అపస్మృతులు జరిగాయనీ, దీంతో పండుగను ఆపేశారమని ఆప్రాంత ప్రజలు తెలిపారు. అయితే శివరాత్రికి ముందు వచ్చే గురువారం 12గ్రామాల ప్రజలు ఆవులపబ్బం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. పరికిదొనకు సమీపంలోని అడవిలోగల కాటమరాజు ఆలయం వద్ద సంక్రాంతిని తలపించేలా ఆవులపబ్బంను నిర్వహిస్తారు. దీంతో ఆయా గ్రామాల్లో సంక్రాంతి సందడి కనిపించదు.

